# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ పార్లమెంట్ వక్ఫ్ (సవరణ) బిల్లు 2025ను ఈరోజు ఆమోదించింది.
- ❖ భూ వివాదాలు తలెత్తకుండా ప్రభుత్వం రెవెన్యూ విబాగంలో అనేక సంస్కరణలు చేపడుతోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.
- ❖ సఖి నివాస్ వసతి గృహాన్ని రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈరోజు గుంటూరులో ప్రారంభించారు.

=====================

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ అధికారులతో ఈరోజు ఆయన అమరావతిలోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అవసరమైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోనూ వర్చువల్ విధానంలో వైద్యసేవలు అందించాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా 13 డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

=====================

పార్లమెంట్ వక్ఫ్ (సవరణ) బిల్లు 2025ను ఆమోదించింది. రాజ్యసభ లో ఈ బిల్లుపై జరిగిన ఓటింగ్ లో 128 మంది అనుకూలంగానూ 95 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో రాజ్యసభలో దాదాపు 12 గంటల పాటు చేపట్టిన చర్చ అనంతరం బిల్లు ఆమోదం పొందింది. కాగా లోక్‌సభ ఇప్పటికే బిల్లును ఆమోదించింది.

=====================

భూ వివాదాలు తలెత్తకుండా ప్రభుత్వం రెవెన్యూ విబాగంలో అనేక సంస్కరణలు చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ రోజు అమరావతిలో మంత్రి 'స్లాట్ బుకింగ్' విధానాన్ని

ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఇదో కీలక ఘట్టమని పేర్కొన్నారు. తొలివిడతలో 26 జిల్లాల్లోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' విధానం అమలులోకి వస్తుందని.. మిగిలిన కార్యాలయాల్లో ఈ నెలాఖరులోగా దశలవారీగా ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా అనేక నూతన నిర్ణయాలు తీసుకుంటున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలియజేస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

=====================

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం తిరుమండ్యం గ్రామంలో వరిధాన్య సేకరణ కేంద్రాన్ని మంత్రి ఈరోజు పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...

(వాయిస్...సెకన్లు)

ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతిహామీలను నెరవేరుస్తున్నామని, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే పథకాలతో రైతు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని చెప్పారు. ఎవరైనా రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులను అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

=====================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో ఈరోజు ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రెండవ బ్లాక్‌లో యూపీఎస్ బ్యాటరీ రూమ్ వద్ద ఈ ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

=====================

సచివాలయంలోని అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత ఈరోజు పరిశీలించారు. ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బంది స్పందించారని 10 నిమిషాల్లోనే ఘటనా స్థలంలో మంటలను అదుపులోకి తెచ్చారని వెల్లడించారు. జీఏడీ, సీఆర్డీఏ భవంతుల్లో ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమికంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని హోంమంత్రి స్పష్టం చేశారు.

విరామం

=====================

ఆస్తి పన్నుకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖ ఈరోజు కీలక ఉత్తర్వులు జారీచేసింది. ప్రాపర్టీ టాక్స్ (ఆస్తి పన్ను) చెల్లింపుదారులు మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2025 - 26 సంవత్సరానికి సంబంధించి పూర్తి పన్ను ఈ నెల 30వ లోపు చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పిస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే పన్ను డిమాండ్ నోటీసులు ఆన్ లైన్లో విడుదల అయ్యాక ERP ద్వారా పన్ను చెల్లింపు ఆప్షన్ వస్తుందని, అందుకు ఈ నెల 6వ తేదీ వరకూ వేచిచూడాలని, వాటి వివరాలు కోసం సంబంధిత వెబ్ సైట్ సందర్శించాలని పేర్కొంది.

=====================

గుంటూరు జిల్లాలోని మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం దాదాపు 26 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఆయన మంగళగిరిలో పేదలకు ఇళ్ల పట్టాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. ఎన్నికల హామీలతో పాటు మంగళగిరికి ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నామని తెలియజేశారు. ఈనెల 13వ తేదీన మంగళగిరిలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. 'ఎన్టీఆర్ సంజీవని' పేరుతో మంగళగిరి, తాడేపల్లిలో క్లినిక్‌లు ఏర్పాటు చేశామని, దుగ్గిరాలలోనూ మొబైల్ క్లినిక్ పెట్టి ఉచిత చికిత్సలతో పాటు మందులు అందిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

=====================

రాష్ట్ర ప్రభుత్వ క్లీన్ ఎనర్జీ విధానంలో భాగంగా విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లను ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (APEPDCL) సి.ఎం.డి. ఇమ్మడి పృథ్వీతేజ్ చెప్పారు. విజయనగరంలోని పాత జిల్లా కోర్టు కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్‌ను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్రంలో వచ్చే 5 సంవత్సరాల్లో 5 వేల విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నిర్దేశించారని అన్నారు. దీనిలో భాగంగా ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్. ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలియజేశారు.

=====================

ఉద్యోగం, చదువు నిమిత్తం నగరాలకు వచ్చే మహిళలకు వసతి కల్పించే సఖి నివాస్ వసతి గృహాన్ని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈరోజు గుంటూరులో ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ఈ సఖి నివాస్ లో వంద మంది మహిళలకు వసతి కల్పించేలా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 53 సఖి నివాస్ లు ఏర్పాటు చేయగా, మరో 30 త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. మహిళా సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.

=====================

ఉద్యానవన పంటల సాగులో అనంతపురం జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. సూక్ష్మ బిందుసేద్యంలో కూడా జిల్లా మంచి పురోగతి సాధిస్తోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన శిక్షణా శిబిరాలను ఈరోజు అనంతపురంలో కలెక్టర్ ప్రారంభించారు.

=====================

ఉత్తర ఆంధ్రప్రదేశ్ దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశాపై సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి వుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

=====================
=====================